నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I | హైదరాబాద్, బుధవారం 1 మే 2024 | SANGAREDDY



రాయపోల్ రోడ్ షోలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, పక్కన వెంకట్రామిరెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి

# రివర్స్ గేరులో రేవంత్ పాలన

- ఒక్క హామీ సరిగ్గా అమలు చేయడం లేదు
- ప్రజలను ఆగం చేస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు
- రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో రోడ్‌షో
- బ్రహ్మరథం పట్టిన ప్రజలు

## నాడు ఓటుకు నోటు.. నేడు ఓట్లకు దేవుళ్లపై ఒట్లు


రాయపోల్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న హరీశ్‌రావు

రాయపోల్, ఏప్రిల్ 30: రాష్ట్రంలో రివర్స్ గేరులో రేవంత్ పాలన కొనసాగుతున్నదని, కేసీఆర్ అమలు చేసిన పథకాలు పేదలకు అందకుండా నాడు ఓటుకు నోటు, నేడు ఓట్లకు ఒట్లు పెట్టుకుంటూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు తిరుగుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం రాత్రి రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి రోడ్‌షోల్లో పాల్గొని మాట్లాడారు. కొత్త పథకాలు ఏమోగానీ, ఉన్న పథకాలను ఆగం చేశారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరిన కేసీఆర్‌పై ఇష్టారీతిగా మాట్లాడుతున్నాడని, ఇది పద్ధతేనా అంటూ ప్రశ్నించారు. చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించి రైతులకు సాగు, తాగునీరు, కరెంట్‌తో పాటు అనేక సంక్షేమ పథకాలు అందించిన కేసీఆర్‌ను అవమానించిన రేవంత్‌రెడ్డికి ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీల బాండ్‌ను బౌన్స్ చేసిన ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కరెంట్, నీళ్లు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే వారి అబద్ధాలకు సమర్థించినట్లే అవుతుందన్నారు. తెలంగాణ అభివృద్ధి కావాలంటే వచ్చిన తెలంగాణను నిలుపుకోవాలనాన్రు. మాయమాటలు చెప్పే రఘునందన్‌రావుకు మరోసారి దుబ్బాక ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు. ప్రజలకు ఏమీ చేయలేని బీజేపీ నాయకులు క్యాలెండర్లతో తిరుగుతున్నారన్నారు. బీజేపీ వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు పెరిగాయన్నారు. రూ.100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేసి అండగా నిలుస్తానన్న వెంకట్రామిరెడ్డిని గెలిపించి, ప్రశ్నించే గొంతును పార్లమెంట్‌కు పంపించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు.

**మోసగాళ్లకు బుద్ధి చెప్పాలి: దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

కేసీఆర్ చొరవతోనే రాయపోల్ మండలం ఏర్పడిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కరువు, కాటకాలకు నిలయమైన రాయపోల్ మండలంలో గోదావరి జలాలు పారించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీజేపీ నాయకుల మాటలకు మరోసారి ప్రజలు మోసపోకుండా వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎంపీగా గెలిస్తే హరీశన్నతో కలిసి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. రాయపోల్ మండలం ఉద్యమాలకు గడ్డ అని, గులాబీ అడ్డా అని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు.

### తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు: వెంకట్రామిరెడ్డి

ఓటమిని జీర్ణించుకోలేక తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్న రఘునందన్‌రావుకు భయపడేది లేదని ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. తనపై అక్కసుతో ఫిర్యాదులు చేస్తున్నారని, తన జీవితం తెల్ల కాగితమని పేర్కొన్నారు. 11 ఏండ్లుగా మీతో కలిసి పనిచేశానని, నేడు ఎన్నికయ్యే అవకాశం కల్పించాలన్నారు. రఘునందన్‌రావు ప్రజలను మోసం చేశాడని, మరోసారి ఓట్ల కోసం వస్తున్నాడని ఆయనను నిలదీయాలన్నారు. ప్రజా సేవ కోసం వచ్చానని, ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే అందుబాటులో ఉండి రుణం తీర్చుకుంటానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, ఎంపీపీ కల్లూని అనితాశ్రీనివాస్, జడ్పీటీసీ యాదగిరి, సోలిపేట సతీశ్‌రెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, చిందం రాజ్‌కుమార్, కత్తి కార్తీకగౌడ్, ఇప్ప దయాకర్, దౌల్తాబాద్ మండలాధ్యక్షుడు రహిమొద్దీన్, ఎంపీపీ సంధ్య, జడ్పీటీసీ రణం జ్యోతి, సమన్వయకర్త రణం శ్రీనివాస్‌గౌడ్, రెండు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




దౌల్తాబాద్‌లో రోడ్‌షోకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు


సంగారెడ్డిలో మాట్లాడుతున్న సాధారణ ఎన్నికల పరిశీలకుడు గోపాల్‌జీ తివారీ, పక్కన వల్లూరు క్రాంతి, జితేష్ వి పాటిల్

## అప్రమత్తంగా వ్యవహరించాలి

- సాధారణ ఎన్నికల పరిశీలకుడు గోపాల్ జీ తివారీ

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 30: ఎన్నికల విధులపై అన్ని శాఖల అధికారులు అప్రమత్తతో వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సాధారణ ఎన్నికల పరిశీలకుడు గోపాల్ జీ తివారీ, వ్యయ పరిశీలకుడు మోతీలాల్ ఎస్ షీటే, కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌తో కలిసి జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లూరు క్రాంతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ స్టేషన్ల వివరాలు రూట్ మ్యాప్‌లో ఓటర్ల వివరాలను వివరించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల మ్యాప్ వివరాలు, గ్రీవెన్స్ కమిటీ, చెక్ పోస్టులు, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాల వివరాలను, ఆయా బృందాల ద్వారా జరుగుతున్న తనిఖీలు, చేపట్టిన కార్యక్రమాల వివరాలను సమీక్షించారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎస్పీ రూపేశ్, కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఎస్పీలు, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ నోడల్ అధికారులు, ఏఆర్వోలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


వట్‌పల్లి: వెంకట్‌ఖ్వాజా ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అనిల్‌కుమార్, క్రాంతికిరణ్

## కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్
- అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్
- వట్‌పల్లిలో కార్యకర్తల సమావేశం

వట్‌పల్లి, ఏప్రిల్ 30: తెలంగాణ ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం వట్‌పల్లిలోని వెంకట్‌ఖ్వాజా ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేసి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, కంటికి కనపడలేదన్నారు. ఉద్యమాలు జరుగుతుంటే పక్కదేశాల్లో తల దాచుకున్నారని ఎద్దేవా చేశారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో తెలంగాణ ప్రజలకు మోసం చేసి గెలిచిందన్నారు. అలాంటి కాంగ్రెస్‌ను ప్రశ్నించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకొని కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి, అందోల్ ఎన్నికల ఇన్‌చార్జి మాణిక్యం, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







రాయికోడ్‌లో మాట్లాడుతున్న చంటి క్రాంతికిరణ్, గాలి అనిల్‌కుమార్

## బీఆర్‌ఎస్‌తోనే గ్రామాలు అభివృద్ధి

- జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

రాయికోడ్, ఏప్రిల్ 30: బీఆర్‌ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మంగళవారం రాత్రి రాయికోడ్ మండలకేంద్రంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హామీలు అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందన్నారు. కేసీఆర్ పాలనలోనే రైతులు సుభిక్షంగా ఉన్నారని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ప్రచారంలో జిల్లా పరిషత్ చైర్మన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి మణిక్యం, జైపాల్‌రెడ్డి, వీరారెడ్డి, తుకారం, విఠల్, లక్ష్మణ్, నిరంజన్, మారుతి, శంకర్ ఉన్నారు.

## రాముడి జపంతో బీజేపీ రాక్షస పాలన

- హుస్నాబాద్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొన్నం

హుస్నాబాద్ రూరల్/ అక్కన్నపేట, ఏప్రిల్ 30: రాముడి జపంతో దేశంలో బీజేపీ రాక్షస పాలన చేస్తున్నదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా హుస్నాబాద్ మండలంలోని పందిల్ల, అక్కన్నపేట మండల కేంద్రంలో నిర్వహించిన పబ్లిక్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. కుల, మతాల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీని ఈ ఎన్నికల్లో బొంద పెట్టాలన్నారు. ఆగస్టు 15 తర్వాత రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఆరు గ్యారెంటీలను ఎన్నికల తర్వాత వందశాతం అమలు చేస్తామన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నియోజకవర్గానికి ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే అంబేద్కర్ సాక్షిగా అభివృద్ధి విషయంలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, బొలిశెట్టి శివయ్య, కేడం లింగమూర్తి, ముత్యాల సంజీవరెడ్డి, జైపాల్‌రెడ్డి, మంజులారెడ్డి, అయిలయ్య, బంక చందు పాల్గొన్నారు








